


రైస్‌మిల్లర్లు బ్యాంక్ గ్యారెంటీ చెల్లించాలి
● వీడియో కాన్ఫరెన్స్‌లో పౌర సరఫరాల శాఖ కమిషనర్ 8

అంకితభావంతో పనిచేస్తేనే ఉద్యోగులకు గుర్తింపు 8
● డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్

పరిషత్ ఎన్నికలకు కసరత్తు

● ఏర్పాట్లలో నిమగ్నమైన అధికార యంత్రాంగం
● జిల్లాలో 20 జడ్పీటీసీ, 227 ఎంపీటీసీ స్థానాలు
● పోటీకి సమాయత్తం అవుతున్న ఆశావహులు



జగిత్యాల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మళ్లీ ఎన్నికల సందడి మొదలు కానుంది. మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. స్థానిక సంస్థల్లో ముందుగా గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగియగా ప్రభుత్వం వాటికి కాకుండా మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీ గుర్తులతో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోందని అధికార పార్టీ వర్గాలు అంటున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు ఎన్ని ఉండాలనే దానిపై అధికారులు ఇప్పటికే ఓ అంచనాకు వచ్చారు. కొత్తగా ఏర్పాటైన మండలాలు, పక్క మండలాల నుంచి కలిసిన గ్రామాలను పరిగణనలోకి తీసుకొని మండలాల వారీగా ఎంపీటీసీల సంఖ్యను నిర్ణయిస్తున్నారు. మండలపరిషత్‌ల సంఖ్య 18నుంచి 20కి చేరింది. గతంలో 214 ఎంపీటీసీ సభ్యుల స్థానాలుండగా ప్రస్తుతం వీటి సంఖ్య 227కు చేరింది. ఈ లెక్కలు రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్‌కు అందజేసినట్లుగా సమాచారం.

● కొత్త మండలాల్లో...

జిల్లాలో 2019లో జరిగిన ఎన్నికల్లో 18 మండల పరిషత్‌లకు ఎన్నికలు నిర్వహించారు. ప్రస్తుతం కొత్తగా ఏర్పాటైన బీమారం, ఎండపల్లి మండలాల్లో ఈసారి ఎన్నికలు జరగనున్నాయి. దీంతో మండల పరిషత్‌ల సంఖ్య 18 నుంచి 20కి చేరింది. గతంలో 214 ఎంపీటీసీ సభ్యుల స్థానాలుండగా ప్రస్తుతం వీటి సంఖ్య 227కు చేరింది. జగిత్యాల జిల్లా పరిధిలోని కొన్ని గ్రామాలు, పెద్దపల్లి జిల్లా పరిధిలోని కొన్ని గ్రామాలను కలిపి ఎండపల్లిని కొత్త మండలంగా ఏర్పాటు చేశారు. ఉమ్మడి మేడిపల్లి మండలం పరిధిలోని కొన్ని గ్రామాలతో బీమారం మండలాన్ని కొత్తగా ఏర్పాటు చేశారు. జిల్లాలో కొత్తగా ఏర్పాటైన రెండు మండలాల్లో ఎంపీటీసీ స్థానాలు, రెండు జడ్పీటీసీ స్థానాలు, రెండు ఎంపీపీ స్థానాలకు కూడా ఎన్నికలు జరగనున్నాయి.

● ప్రస్తుతం ప్రత్యేక పాలన

గత యేడాది జనవరి 31న సర్పంచ్‌ల పదవీ కాలం ముగియగా ఫిబ్రవరి నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఇప్పటికే గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం అనివార్య కారణాలతో వాయిదా వేసింది. జిల్లాలో 214 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా వారి పదవీ కాలం గత యేడాది జూలై 3వ తేదీతో ముగిసింది. జిల్లాలో 18 మంది జడ్పీటీసీ సభ్యులుండగా వారి పదవీ కాలం కూడా ఒక్క రోజు తేడాతో అంటే జూలై 4వ తేదీతో ముగిసింది. గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ బాధ్యతలను ప్రత్యేకాధికారులకు అప్పగించారు. ఇప్పటి వరకు స్థానిక సంస్థల్లో దేనికీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాలేదు. గతంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కావాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగా ఓటరు జాబితాను సిద్ధం చేయాలని, బీసీ కమిషన్ నివేదికతో సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించిన విషయం తెలిసిందే. రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ షెడ్యూల్ విడుదల చేయడంతో ఆ ప్రక్రియ సైతం పూర్తి చేశారు. అయితే అది కాస్తా పక్కన బెట్టిన ప్రభుత్వం తాజాగా పరిషత్ ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించిందని సంబంధిత వర్గాలు అంటున్నాయి. దీంతో ప్రస్తుతం అందరీ దృష్టి మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలపై పడింది.

డ్రోన్ సర్వేకు సహకరించాలి

-అదనపు కలెక్టర్ బి. గౌతంరెడ్డి



డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డి

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నిర్వహిస్తున్న డ్రోన్ సర్వేకు పట్టణ ప్రజలు సహకరించాలని అదనపు కలెక్టర్ బి. గౌతంరెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని మిని స్టేడియంలో అమృత్ 2.0 క్రింద పట్టణంలో నూతన ప్లాన్ కోసం సర్వే అఫ్ ఇండియా డిపార్ట్‌మెంట్ చే నిర్వహిస్తున్న డ్రోన్ సర్వేను మున్సిపల్ ప్రత్యేకాధికారి, అదనపు కలెక్టర్ గౌతం రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో 50సర్వే పాయింట్లను గుర్తించినట్లు తెలిపారు. సర్వే ద్వారా పక్కా సమాచారం సేకరిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని చెరువులు, కుంటలు, ఖాళీ స్థలాలు గుర్తించనున్నట్లు తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.మోహన్, మేనేజర్ వెంకటలక్ష్మీ, టిపిఓ రాజేంద్రపసాద్, ఎఈ తిరుపతి, ఆర్ఓ మీర్జా అజ్మతుల్లా బెగ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్డీవో రఘువరన్

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని డీఆర్డీవో రఘువరన్ మండల స్థాయి అధికారులకు సూచించారు. గురువారం కోరుట్ల మండలంలోని వెంకటాపూర్, సర్వరాజుపూర్, అయిలాపూర్ గ్రామాలలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. గ్రామాలోని నర్సరీలు, కంపోస్ట్ షెడ్, వైకుంఠధామాల్లో నిర్వహిస్తున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణలతో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

తాగు నీటి ఇబ్బందులు లేకుండా చూడాలి



మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

ధర్మపురి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిలో తాగు నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కందుకూరి శ్రీనివాస్‌కు గురువారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వీధుల్లో తీవ్ర మంచి నీటి ఎద్దడి నెలకొందని అన్నారు. వచ్చే వేసవి కాలం దృష్టిలో పెట్టుకుని తాగు నీటి సరఫరాలో ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ధర్మపురి పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, జిల్లా ఓబీసీ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, పట్టణ మాజీ అధ్యక్షులు తిరుమన్ సత్యనారాయణ, మండలోజు సూరజ్, ఆనందాసు నవీన్, అప్పం శ్రీనివాస్, సుంకు మదుసూధన్, కొండవీటి శివ, బాకి రాజేష్, బండారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మూసుకుపోయిన ఎస్సారెస్పీ కాలువ తూములు

-కాలనీలోకి చేరిన నీరు



రాయికల్‌లోని కాలనీలోకి చేరిన నీరు

రాయికల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణ శివారులోని ఎస్సారెస్పీ కాలువ తూములు చెత్తాచెదారంతో నిండి మూసుకుపోయాయి. నీటిని విడుదల చేసిన అధికారులు తూములు మూసుకుపోవడంతో శివాలయం సమీపంలోని కాలనీలోకి నీరు చేరింది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తూములను శుభ్రం చేయించడంతో పాటు కాలనీలోకి నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

యూరియా కొరత తీర్చాలి



ఏఈవో సుష్మశ్రీకి వినతిపత్రం ఇస్తున్న మాజీ వైస్ ఎంపీపీ

కథలాపూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని తాండ్ర్యాలలో యూరియా కొరత తీర్చాలని కోరుతూ గురువారం స్థానిక ఏఈవో సుష్మశ్రీకి మాజీ వైస్ ఎంపీపీ గండ్ర కిరణ్‌రావు సహా రైతులు వినతిపత్రం అందించారు. గత కొద్ది రోజులుగా యూరియా దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.

ప్రస్తుతం వరి పంటకు యూరియా అవసరం ఉండగా దొరకని కారణంగా అదను దాటి పోతోందని ఆందోళన వెలిబుచ్చారు. ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకుని సకాలంలో యూరియా అందేలా చూడాలని కోరారు.

కాంగ్రెస్ సభ్యత్వ నమోదులో జిల్లాను అగ్రగామిగా నిలపాలి

-మహిళా కాంగ్రెస్ కరీంనగర్, జగిత్యాల జిల్లాల ఇన్‌చార్జి సుగుణ



సభ్యత్వ నమోదును పరిశీలిస్తున్న సుగుణ

జగిత్యాల అగ్రికల్చర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపడుతున్న సభ్యత్వ నమోదులో జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపాలని మహిళా కాంగ్రెస్ కరీంనగర్, జగిత్యాల జిల్లాల ఇన్‌చార్జి సుగుణ పిలుపునిచ్చారు. గురువారం జగిత్యాల జిల్లా సభ్యత్వ నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మీ దేవేందర్‌రెడ్డి తదితరులు సుగుణకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో సభ్యత్వ నమోదు ప్రక్రియ సెప్టెంబరు 15నుంచి ప్రారంభించామన్నారు. జిల్లా, ఆయా మండలాల బాధ్యులు రాష్ట్ర శాఖ ఆదేశానుసారం సభ్యత్వ లక్ష్యాన్ని పూర్తి చేసి సహకరించాలని కోరారు. అనంతరం అనంతరం సుగుణ మాట్లాడుతూ ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపడుతున్న సభ్యత్వంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉండడం సంతోషకరం అన్నారు. జగిత్యాల జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉండేందుకు మహిళా కాంగ్రెస్ బాధ్యులు చొరవ చూపాలన్నారు. వచ్చే ఎన్నికల్లో పాల్గొని, విజయం సాధించే దిశగా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ బాధ్యులు పిప్పరి అనిత, నాగలక్ష్మీ, సోగ్రాబి, బింగి సుమ, మమత, విజయలక్ష్మీ, కరుణశ్రీ, లత, లక్ష్మీ, పద్మ, జయశ్రీ, రూప, హరిత, రుబీనాతో పాటు వివిధ హోదాల మహిళా కాంగ్రెస్ బాధ్యులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి పట్టణంలోని మినీ స్టేడియంలో శనివారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 11వ తెలంగాణ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయి పోటీల కోసం జిల్లా స్థాయిలో సెలక్షన్స్ నిర్వహిస్తున్నామని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల విద్యార్థులకు క్రీడాకారులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. 18, 19 వ తేదీల్లో ఉస్మానియా యూనివర్సిటీలో సింథటిక్ ట్రాక్‌లో పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన బాల, బాలికలు ఉదయం 8 గంటలకు రిపోర్టు చేయాల్సిందిగా ఆయన కోరారు.

పన్నులు చెల్లించాలి

కొడిమ్యాల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇళ్ళ యజమానులు గ్రామ పంచాయతీ కార్యాలయానికి చెల్లించాల్సిన పన్నులు చెల్లించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎల్.వంశీవర్ధన్ కోరారు. గురువారం కార్యదర్శి విలేకరులతో మాట్లాడుతూ ఇంటి, నీటి పన్ను 25లక్షల 46వేల 175 రూపాయలు వసూలు చేయాల్సి ఉండగా సుమారు 14లక్షల 25వేల రూపాయలు వసూలైనట్లు తెలిపారు. వసూలు చేయాల్సిన సుమారు 11లక్షల రూపాయలను మార్చి 31లోపు వసూలు చేయటం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పన్నుల వసూలుకు గ్రామ పంచాయతీ సిబ్బంది రెండు గ్రూపులుగా గ్రామంలో నిత్యం వసూలు చేస్తున్నారన్నారు. వసూలు కోసం వచ్చే సిబ్బందికి ఇళ్ళ యజమానులు ఇంటి పన్ను, నీటి పన్ను చెల్లించి సహకరించాలని కార్యదర్శి కోరారు.

జాతీయ రహదారిని విస్తరించాలి



కేంద్ర మంత్రి గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న ప్రజాప్రతినిధులు

కోరుట్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట నుంచి సిరిసిల్ల వరకు నిర్మాణం చేపట్టిన జాతీయ రహదారిని వేములవాడ మీదుగా కోరుట్ల వరకు విస్తరింప చేయాలని గురువారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కేటీఆర్‌తో కలిసి కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ వినతి పత్రం అందించారు. జాతీయ రహదారి విస్తరింపజేస్తే ప్రముఖ పుణ్య క్షేత్రాలైన వేములవాడతో పాటు కొండగట్టు, ధర్మపురి పట్టణాలు కలిపే జాతీయ రహదారి 63కి అనుసంధానం జరుగుతుందని కేంద్ర మంత్రికి వివరించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గతంలో ఈ ప్రతిపాదనను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినట్లు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ గుర్తు చేశారు.

సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



ఎమ్మెల్సీ కవితకు వినతిపత్రం సమర్పిస్తున్న మాజీ సర్పంచ్‌లు

జగిత్యాల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పాటు, రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సర్పంచ్‌ల బిల్లులను, రైతుభరోసా నిధులతో తక్షణమే విడుదల చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ ఆధ్వర్యంలో జగిత్యాల నియోజకవర్గానికి చెందిన పలువురు మాజీ సర్పంచ్‌లు ఎమ్మెల్సీ కవితను తన నివాసంలో గురువారం కలిసి సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రైతుభరోసా విషయంలో రాష్ట్రప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో రైతు బంధు నిధులు సమయానికి పడేవని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి పాలనలో మాత్రం దశలవారీగా నామమాత్రపు నిధులు మాత్రమే విడుదల చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. రైతులు పంటలు వేసినా పెట్టుబడిసాయం ఇప్పటి వరకు అందకపోవడం ఏంటని ఆమె ప్రశ్నించారు. రైతులను మోసం చేయాలని చూస్తే ఊరుకోబోమని కవిత హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాదైనా సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి భరోసా నిధులతో పాటు, పెండింగ్‌లో ఉన్న సర్పంచ్‌ల బిల్లులు మంజూరు చేయాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల నియోజకవర్గంలోని మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలి

-ఎన్‌డీఆర్ఎఫ్ ఎస్సై ముఖేష్‌కుమార్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులు

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 6 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నేషనల్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(ఎన్‌డీఆర్ఎఫ్) ఎస్సై ముఖేష్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని పెద్దాపూర్ గ్రామ శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలురల గురుకుల పాఠశాల, కళాశాలలోని విద్యార్థులకు ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నేషనల్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం ఫైర్ సేఫ్టీపై ప్రయోగాత్మక అవగాహన కల్పించారు. పాఠశాల భవనాలు, ఇండ్లల్లో విద్యుత్ ప్రమాదాలు, పెట్రోల్ బంక్‌లు తదితర ప్రదేశాలలో ప్రమాదం జరిగినప్పుడు మంటలను నీటితో ఆర్పవద్దన్నారు. నీటి ప్రవాహంలో చిక్కుకున్న వారిని రక్షించడం, లైఫ్ జాకెట్లు, రోప్ వినియోగం వంటితో పాటు గుండెపోటు వచ్చిన సమయంలో అత్యవసరంగా మొదట చేపట్టాల్సిన ప్రాథమిక చికిత్స సీపీఆర్ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై ముఖేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రమాదాలు సంభవించినప్పుడు ముందుగా సంబంధించిన అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, మండల విద్యాధికారి చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ మాధవిలత, ఆర్ఐ ఉమేష్, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో కూలీ ఆత్మహత్య

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం చందనాపూర్ పంచాయతీ పరిధిలోని సింగిరెడ్డిపల్లెలో బుధవారం రాత్రి జూల రఘు(32) అనేకూలీ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కూలి చేసుకుంటూ జీవిస్తున్న రఘు కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. అతిగా మద్యం సేవించడం, కూలికి వెళ్ళకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో మనస్తాపానికి గురైన రఘు బుధవారం ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, నాలుగు నెలల కుమార్తె ఉన్నారు. భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని ఒకరు..


సంతోష్ (ఫైల్)

సుల్తానాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం మియాపూర్‌లో కేశ సంతోష్(40) అనే యువకుడు గురువారం సాయంత్రం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేశ సంతోష్ అవంతి దంపతులు మియాపూర్‌లో కిరాణ షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గురువారం సాయంత్రం స్కూల్‌నుంచి కుమారులు వ్యాన్‌లో గ్రామానికి రాగా వారిని ఇంటి వద్దకు తీసుకువచ్చాడు. భార్య షాపులో ఉండగా ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కిందకు దించి సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే సంతోష్ మృతిచెంది ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. గతంలో ఒకసారి ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి వివరాలను నమోదు చేసుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

చైన్ స్నాచింగ్‌కు యత్నించిన
నిందితుడికి మూడు నెలల జైలు

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): చైన్‌స్నాచింగ్‌కు యత్నించిన ఒకరికి మూడునెలల జైలుశిక్షతోపాటు రూ.500 జరిమానా విధిస్తూ జగిత్యాల కోర్టు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ మెజిస్ట్రేట్ శ్రీనిజ గురువారం తీర్పువెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. జగిత్యాలరూరల్ మండలం తాటిపెల్లి గ్రామానికి చెందిన ఆకుల రాధ తన కుమార్తెతో కలిసి 2018లో వ్యవసాయ పనులకు వెళ్తుండగా పోచంపెల్లి మహేష్ స్కూటీపై వచ్చి బాలికమెడలో ఉన్నచైన్‌ను ఎత్తుకెళ్లేందుకు యత్నించాడు. బాధితురాలు జగిత్యాల రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై సతీష్‌కుమార్ కేసు నమోదుచేశారు. సాంకేతిక పరి జ్ఞానంతో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డ నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మహేష్‌ను రిమాండ్‌కు తరలించారు. కోర్టు డ్యూటి పోలీసులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ తమ వాదనలు వినిపించగా నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

పోక్సో కేసులో ఇద్దరు యువకుల రిమాండ్

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట సర్కిల్ పరిధిలోని గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట, నర్మాల గ్రామాలకు చెందిన ఇద్దరు యువకులను పోక్సో కేసులో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని రూరల్ సీఐ శ్రీనివాస్‌గౌడ్ గురువారం తెలిపారు. కొంతకాలంగా యువకులు బాలికల అశ్లీల వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తుండడంతో పోలీస్ సైబర్ విభాగం గుర్తించిందని పేర్కొన్నారు. అదుపులోకి తీసుకుని విచారించామని చెప్పారు. గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు. నిందితుల సెల్‌ఫోన్లను స్వాధీనపర్చుకుని పరిశీలించడం వల్ల అశ్లీల వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేశామని అంగీకరించారని వెల్లడించారు. ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ వివరించారు.

కుక్కలతో చిన్నారికి వైరస్ : ఆస్పత్రిలో చికిత్స

కోనరావుపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో కుక్కల కారణంగా ఓ చిన్నారికి వైరస్ సోకడంతో హైద్రాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. గ్రామానికి చెందిన చేపూరి శ్రీమేథ(4) అనే చిన్నారికి జ్వరంతో పాటు శరీరంపై అలర్జీ ఏర్పడింది. అవి ఎక్కువ కావడంతో చిన్నారిని సిరిసిల్లలోని ఆస్పత్రికి తరలించారు. అన్ని రకాల పరీక్షలు చేసినా నిర్ధారణ కాకపోవడంతో నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి బ్రూసెల్లా ఇది పీకల్ వైరస్‌గా గుర్తించారు. కలుషిత చికెన్ వ్యర్థాలు, నీటిని తాగడం వల్ల, పచ్చి మాంస వ్యర్థాలు తినడం వల్ల కుక్కలకు ఈ వైరస్ సోకుతుందని, అవి తిరిగిన ప్రదేశాల్లో చిన్నారులు తిరిగితే ఈ వైరస్ సోకుతుందని వైద్యులు తెలిపారని తెలిసింది. కాగా గ్రామంలో కొన్ని నెలలుగా కుక్కల బెడద ఎక్కువవుతోందని, అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

ఎండపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామంలోని ఐకేపీ కేంద్రం వద్ద గురువారం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొట్టడంతో చీకటి వెంకటేష్ (45) అనే వ్యక్తి మృతిచెందాడు. ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపిన వివరాల ప్రకారం ఎండపల్లి గ్రామానికి చెందిన చీకటి వెంకటేష్ ద్విచక్ర వాహనంపై తమ బంధువైన చెర్లపల్లి గ్రామానికి చెందిన చీకటి రాజేశ్వరితో కలిసి ఓ శుభ కార్యానికి వెళ్ళారు. తన బంధువును చెర్లపల్లిలో ఎండపల్లికి వచ్చేటప్పుడు ఈ ప్రమాదం జరిగింది. వెంకటేష్ తల తెగి పడింది. మృతుడు పొద్దంతా ట్రాలీ నడుపుకుంటూ, రాత్రి సమయంలో రాజారాంపల్లి గ్రామంలోని ఓ పెట్రోల్ బంక్‌లో పని చేస్తాడు. వెంకటేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

జాతీయ రహదారి పనులు ముమ్మరం

● ఇరుకుల్ల వద్ద కొనసాగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణం ● దుర్శేడ్ శివారు రైల్వే లైన్ కింద అండర్ బ్రిడ్జి పూర్తి


ఇరుకుల్ల వద్ద ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న ఓవర్ బ్రిడ్జి


ఇరుకుల్ల నుంచి ఎలబోతారం మీదుగా వెళ్లే రహదారి పనులు


దుర్శేడ్ శివారులోని రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద సాగుతున్న పనులు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్- వరంగల్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-563) నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం భారత మా ల యోజన కింద 2,146 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 68 కిలో మీటర్ల మేరకు ఫోర్‌లైన్ రోడ్డు నిర్మిస్తోంది. ఇందుకు 325.125 హెక్టార్ల భూసేకరణ పూర్తి చేసింది. కరీంనగర్ మండలం ఇరుకుల్ల, దుర్శేడ్ శివారులో బొమ్మకల్ మానేరు వాగు మీదుగా మానకొండూర్ వరకు రహదారి పనులు వేగంగా సాగుతున్నాయి. రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా అండర్ పాస్ బ్రిడ్జిలు, ఇరుకుల్ల, మానేరు తదితర వాగులపై మొత్తం తొమ్మిది మేజర్ బ్రిడ్జిలను నిర్మిం చనున్నారు.

బొమ్మకల్ మానేరు వాగుపై బ్రిడ్జి పనులు పూర్తి కాగా ప్రస్తుతం కరీంనగర్-గోదావరిఖని రహదారిలో ఇరుకుల్ల వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి. బ్రిడ్జి నిర్మిస్తుండగా రెండు పక్కల తారు రోడ్డును ఏర్పాటు చేసి వాహనాలను దారి మళ్లించి పనులు చేపడుతున్నారు. దుర్శేడ్ శివారులోని రైల్వే బ్రిడ్జి కింది నుంచి అండర్ పాస్ పనులు పూర్తయ్యాయి. ఈ రహదారి నుంచి వెళ్లేందుకు గతంలో రైతులు కొంత ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం రైల్వే బ్రిడ్జి కింద రహదారి పనులు పూర్తి కావడంతో ఇరుకుల్ల మీదుగా మానకొండూర్‌కు వెళ్లేందుకు రహదారి సుగమం అయ్యింది. గోదావరిఖని నుంచి వరం గల్‌కు వెళ్లే వాహనదారులు ఇప్పుడు జాతీయ రహదారిపై నుంచే వెళ్లడంతో దూర భారం తగ్గిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎలబోతారం, జూబ్లీనగర్, నగునూర్, కొక్కెరకుంట వద్ద పనులు ఇంకా మొదలు కాలేదు.

అవార్డు కాపీలు ఇచ్చినా.. అందని పరిహారం

జాతీయ రహదారి కింద వందలాది మంది రైతుల వద్ద నుంచి భూములను సేకరించారు. ఇప్పటికీ నష్ట పరిహారం అందించలేదు. బొమ్మకల్ శివారు, దుర్శేడ్, ఇరుకుల్ల గ్రామాల్లో భూములు కోల్పోయిన రైతులకు మాత్రమే నష్ట పరిహారం అందించారు. ఇరుకుల్లలో బావులు కోల్పోయిన రైతులకు పరిహారం అందలేదు. రెండు నెలల క్రితం ఎలబోతారం, జూబ్లీనర్, నగునూర్ గ్రామంలో భూమి కోల్పోయిన రైతులకు అవార్డు కాపీలను అందజేశారు. అవార్డు కాపీలు ఇచ్చి రెండు నెలలు గడుస్తున్నా నష్ట పరిహారం అందించడం లేదని రైతులు ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకుని నష్టపరిహారం అందించాలని భూమి కోల్పోయిన రైతులు కోరుతున్నారు.

ప్రాణాలు తీసిన వివాహేతర సంబంధం

● వీడిన మమత హత్య కేసు మిస్టరీ

● నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్

చొప్పదండి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మమత హత్యకేసును పోలీసులు ఛేదించారు. జనవరి 27న కరీంనగర్- జగిత్యాల రహదారి గంగాధర మండలం కురిక్యాల శివారులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆ మృతదేహం మంచిర్యాల జిల్లాకు చెందిన మేడ మమత(25)గా బంధువులు గుర్తించారు. భర్తతో గొడవపడి కుమారుడితో వేరేచోట ఉంటున్న మమత మరోవ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. అతడి కుటుంబ సభ్యులు సుపారీ ఇచ్చి హత్య చేయించారు. చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ మమత మంచిర్యాల తిలక్‌నగర్‌లో తెలిసినవారి ఇంట్లో ఉంటూ క్యాటరింగ్ పని చేస్తోంది. కొంతకాలంగా కులుమల్ల భాస్కర్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. రామకృష్ణాపూర్‌కు చెందిన భాస్కర్ సింగరేణి ఉద్యోగి. అతడు తన కుటుంబాన్ని పట్టించుకోకుండా జీతాన్ని మమతకే ఇచ్చేవాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు భాస్కర్‌ను పలుమార్లు మందలించారు. అయినా అతను మారలేదు.

● రూ. ఐదు లక్షల సుపారీ ఇచ్చి..

మమతకు భాస్కర్‌ను దూరం చేయాలని అతడి సోదరి నర్మద, తండ్రి రాయలింగు, బావ వెంకటేష్, మరోవ్యక్తి రఘుతో కలిసి పథకం రచించారు. మమతను హత్య చేసేందుకు వేల్పుల కల్యాణ్‌కు ఐదు లక్షల రూపాయల సుపారీ ఇస్తానని ఒప్పందం చేస్తుకున్నారు. 60 వేల రూపాయల అడ్వాన్స్ ఇచ్చారు. అనంతరం రంగంలోకి దిగిన కల్యాణ్ పథకం ప్రకారం మమతను వారం రోజుల పాటు అనుసరించాడు. ఆమెతో పరిచయం పెంచుకుని అవసరానికి డబ్బులు ఇచ్చి దగ్గరయ్యాడు. జనవరి 25న ఓ కారు అద్దెకు తీసుకుని మమతను నమ్మించి కుమారుడితోపాటు బయటకు తీసుకెళ్లాడు. రాత్రి 10 గంటల వరకు మంచిర్యాలలో తిప్పుతూ కారులోనే కత్తితో మెడపై గాయపరిచి, నైలాన్ తాడుతో గొంతు బిగించి హత్య చేశాడు. అనంతరం భాస్కర్ సోదరి నర్మద, తండ్రి రాయలింగు, వెంకటేష్, రఘును పిలిపించి మమత మృతదేహాన్ని చూపించాడు. వారి వద్ద మిగతా నాలుగు లక్షల రూపాయలు తీసుకున్నారు. కారులో జగిత్యాల మీదుగా కురిక్యాల శివారులోని కాలువ వద్దకు వచ్చి రాత్రి 11 గంటలకు మమత మృతదేహాన్ని పడేసి హైదరాబాద్‌కు బాబును తీసుకుని వెళ్లిపోయాడు.

జనవరి 27న హత్య విషయం వెలుగు చూడగా రంగంలోకి దిగిన పోలీసులు సీసీ పుటేజీలు పరిశీలించగా సిల్వర్ కలర్ కారులో మమత ఎక్కినట్లు గుర్తించారు. కారు నంబర్‌తో నేరస్థుడు చెన్నైలోని ఓ హోటల్‌లో ఉన్నట్టు గుర్తించారు. వారు అక్కడికి చేరుకోగా కల్యాణ్ బాబును వదిలి పారిపోయాడు. బాబును తీసుకు వచ్చిన పోలీసులు రెండురోజుల క్రితం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈనెల 5న గంగాధర మండల వెంకటయ్యపల్లి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా మమత హత్యకేసు నిందితుడు వేల్పుల కల్యాణ్ అదుపులోకి తీసుకున్నారు. మమత హత్య కేసును ఛేదించిన చొప్పదండి సీఐ ప్రకాష్, ఎస్ఐ నరేందర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ జంపయ్య, రామడుగు కానిస్టేబుల్ శ్రీధర్, ఐటీసెల్ కానిస్టేబుల్స్ ప్రదీప్, మహేందర్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.

బాలిక అదృశ్యం

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కళాశాలకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన ఓ బాలిక అదృశ్యం కాగా జగిత్యాలపట్టణ పోలీసులు గురువారం కేసు నమోదుచేశారు. జగిత్యాల పట్టణంలోని ఓకళాశాలలో ఇంటర్ చదువు తున్న 16సంవత్సరాల బాలిక రెండు రోజుల క్రితం ఇంటి నుంచి కళాశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంటికి తిరిగిరా లేదు. దీంతో బాధితకుటుంబ సభ్యులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ

● తప్పిన ప్రమాదం

హుజూరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని జమ్మికుంటరోడ్‌లో ఆర్టీసీబస్సును లారీ ఢీకొట్టింది. హుజూరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ మినీబస్సు బస్టాండ్ నుంచి జమ్మికుంటకు వెళ్తోంది. హుజూరాబాద్ నుంచి జమ్మికుంటకు వెళ్తున్న లారీ ఓవర్‌టేక్ చేస్తూ బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మద్యం పట్టివేత

వీణవంక ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్కల్ గ్రామం లో ఎన్నికల కోడ్ ఉల్లంగించి మద్యం అమ్ముతున్న కొలిపాక స్వామిని పోలీ సులు పట్టుకున్నారు. స్వామి కిరాణా దుకాణంలో తనిఖీ చేయగా 5390 రూపాయల విలువ చేసే బీరుబాటిళ్లు లభించగా వాటిని పోలీసుస్టేషన్ తర లించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

శంకరపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నం గ్రామశివారులో ద్విచక్రవాహనానికి కుక్క అడ్డు రావడంతో బైక్‌పైనుంచి పడి ఓవ్యక్తికి గాయాలయ్యాయి. స్థాని కులు తెలిపిన వివరాల ప్రకారం.. శంక రపట్నం మండలం ఇప్పలపల్లి గ్రామా నికి చెందిన వెంగళ శ్రీనివాస్ వ్యక్తిగత అవసరాల కోసం కేశవపట్నం వచ్చి వెళ్తున్నాడు. ఈక్రమంలో ఊరి మధ్య లో ఫ్లైఓవర్ దగ్గర కుక్క అడ్డు రావ డంతో ఒక్కసారిగా బైక్‌పై నుంచి కిందపడ్డాడు. దీంతోశ్రీనివాస్‌కు ఎడమ కాలువిరిగింది. గమనించిన స్థానికులు 108లో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రూ.7,100 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7,100పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 14మంది రైతులు 168క్వింటాళ్ల విడి పత్తి, ఆరుగురు రైతులు ఎనిమిది క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,100, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి శివారులో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన రైతు జంగిలి అంజయ్య(65) మృతి చెందాడు. కొత్తపల్లి సంతకు వచ్చి సామగ్రిని కొనుగోలు చేసి తిరిగి సైకిల్‌పై వెలిచాల వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు అతివేగంగా ఢీకొట్టింది. దీంతో అంజయ్య, తలకు, ఇతరచోట్ల తీవ్ర గాయాలతో మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. అం.య్య మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మార్చ్యూరీలో భద్రపరిచామని పోలీసులు తెలిపారు.

మత్స్యగిరీంద్ర స్వామి
బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

సైదాపూర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి గ్రామంలో ఈ నెల 7 నుంచి 13 వరకు నిర్వహించే స్వయంభూ మత్స్యగిరీంద్ర స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆలయ చైర్మన్ సారబుడ్ల వెంకట్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

రూ. 5 కోట్ల అప్పు చేసి నగల వ్యాపారి పరారీ


● గోదావరిఖనిలో ఘటన ● ఠాణాను ఆశ్రయించిన బాధితులు


గోదావరిఖనిలో దుకాణం వద్ద బాధితులు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని బులియన్ మార్కెట్‌లోని నగల వ్యాపారి తానాజీ జాదవ్ బోర్డు తిప్పేశాడు. షాపు భవనాన్ని అమ్మివేసి రాత్రికి రాత్రి కుటుంబంతో వెళ్లిపోయాడు. రూ.5కోట్ల మేర అప్పులు చేసి అదృశ్యమైనట్టు బాధితులు పేర్కొంటున్నారు. షాపు భవనం కొనుగోలు చేసిన యజమాని జ్యువెల్లరీ బోర్డు తీసివేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. బాధితులు గురువారం పెద్ద సంఖ్యలో శ్రీనాథ్ జువెల్లర్స్ వద్దకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని బాధితులను సముదాయించారు. మహారాష్ట్రకు చెందిన తానాజీ జాదవ్ నాలుగు దశాబ్దాల క్రితం గోదావరిఖనికి వచ్చి నగల వ్యాపారం చేస్తూ స్థిరపడ్డాడు. ఇక్కడ సింగరేణి కార్మికులు, రిటైర్డ్ కార్మికులు, స్థానికులతో పరిచయాలు పెంచుకుని లక్షల్లో అప్పులు చేశాడు. బంగారం నగలు తాకట్టు పెట్టుకోవడం, ఆర్డర్‌పై బంగారు నగలు చేయించడం వంటివి చేశాడు. కేవలం గోదావరిఖని అడ్డగుంటపల్లికి చెందిన యాదవ కాలనీవాసులే 30మంది శ్రీనాథ్ జ్యువెల్లర్స్‌లో నగలు తాకట్టు పెట్టడం, నగలు చేయించేందుకు డబ్బులు ఇచ్చినట్టు తెలుస్తోంది. ఒకరికి తెలియకుండా మరొకరి వద్ద కోట్లలో డబ్బులు తీసుకున్నాడు. యైటింక్లయిన్ కాలనీ ఎస్‌టీ కాలనీకి చెందిన పలువురి వద్ద కూడా పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకున్నట్టు తెలుస్తోంది. బాధితుల్లో కరీంనగర్, మంచిర్యాల వాసులు కూడా ఉన్నట్లు సమాచారం. ఇందులో ఒక మాజీ కార్పొరేటర్ కూడా బాధితుడిగా ఉన్నట్టు సమాచారం. ఇటీవల అతని షాపు భవనాన్ని, మరో భవనాన్ని అమ్మి కొద్ది మొత్తంలో ఒత్తిడి తెచ్చిన బాధితులకు చెల్లించినట్టు తెలుస్తోంది. బాధితుల సంఖ్య ఎక్కువగా ఉండడం, చెల్లించేది రూ.5కోట్ల పైనే ఉండడంతో సదరు వ్యాపారి కుటుంబంతో వెళ్లిపోయినట్టు తెలుస్తోంది. బాధితులు గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు బాధితుల వివరాలు తీసుకుంటున్నారు. ఈ ఘటన రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సంచలనం సృష్టించింది. ఇప్పటికే పలువురు వ్యాపారులు ఐపీలు పెట్టగా ఇప్పుడు నగల వ్యాపారి ఉడాయించడతో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతన్నారు.

జల్సాల కోసం వరుస చోరీలు


● గోదావరిఖనిలో ఇటీవల ఐదు ఇళ్లలో దొంగతనం


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమేష్

కోల్‌సిటీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడ్డ ఓ దొంగ డబ్బు కోసం చోరీలకు పాల్పడుతున్నాడు. ఇప్పటికే 11 చోరీ కేసుల్లో నిందితుడైన ఘరానా దొంగ ఇటీవల గోదావరిఖనిలో ఐదు ఇండ్లలో చోరీలకు పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. గోదావరిఖని ఎల్‌బీనగర్‌కు చెందిన ఐత వెంకటేష్‌ను గురువారం వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి సాంత్రో కారు, రెండు మొబైల్ ఫోన్లు, రూ.20వేల నగదు, 130గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. శనివారం సాయంత్రం ఏసీపీ మడత రమేష్ అరెస్టు వివరాలను వెల్లడించారు.

గోదావరిఖనికి చెందిన పాత నేరస్థుడు ఐత వెంకటేష్ జల్సాల కోసం చోరీలకు పాల్పడుతున్నాడు. తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా మధ్యాహ్నం రెక్కీచేసి రాత్రి కొల్లగొడతాడు. గత నెల 26న మార్కండేయకాలనీకి చెందిన రమేష్ అనే సింగరేణి ఉద్యోగి బంధువు చనిపోతే ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో వెళ్లాడు. ఆ ఇంట్లో చొరబడ్డ వెంకటేష్ రూ.3.42లక్షలు దొంగిలించాడు. ఆ సొమ్ముతో హైదరాబాద్‌లో కారు కొని జల్సాలు చేశాడు. రెండు మొబైల్ ఫోన్లు కొనడమే కాకుండా స్నేహితుడికి రూ.20వేలు అప్పుగా ఇచ్చాడు. ఈ చోరీ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు నిందితుడి కోసం గాలించారు. నిందితుడు పాత నేరస్థుడే అని గుర్తించి అతన్ని గురువారం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి కారు, రెండు మొబైల్ ఫోన్లు, రూ.20వేల నగదు, 130గ్రాముల వెండిని స్వాధీనం చేసుకున్నారు. అతన్ని విచారించగా ఇటీవల అశోక్‌నగర్‌లో పులిపాక స్వరూప ఇంట్లో చోరీచేసి గ్యాస్ సిలిండర్, డబ్బులు ఎత్తుకెళ్లానని, ఏడు నెలల క్రితం మార్కండేయకాలనీలో ఒకఇంట్లో చోరీ చేసి బంగారు, వెండి వస్తువులు దొంగిలించాడని, 11నెలల క్రితం ప్రశాంత్‌నగర్‌లో ఒక ఇంట్లో నాలుగున్నర తులాల బంగారం, 16తులాల వెండి వస్తువులు దొంగిలించాడని ఏసీపీ తెలిపారు. కేసు ఛేదించడంలో కృషిచేసిన సీఐ ఇంద్రసేనారెడ్డి, సీఐ-2 రవీందర్, క్రైమ్‌పార్టీ హెడ్‌కానిస్టేబుల్ రమేష్, శ్రీనివాస్, కానిస్టేబుళ్ల శ్రీనివాస్, వెంకటేష్, రమేష్, మధుసూధన్‌లకు ఏసీపీ రివార్డులు అందించారు.

కుమారులు పట్టించుకోవడం లేదని
సీపీని ఆశ్రయించిన వృద్ధ దంపతులు


సీపీకి ఫిర్యాదు చేస్తున్న వృద్ధ దంపతులు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పోతారానికి చెందిన గుజ్జుల సాయిలు, చిలుకమ్మ దంపతులు కుమారులు పట్టించుకోవడం లేదని గురువారం సీపీని ఆశ్రయించారు. ఇద్దరు కుమారులు ఉద్యోగులని, ఆస్తులు పంచుకున్నారని, తమ పోషణ చూడడం లేదని ఫిర్యాదు చేశారు. పెద్ద కుమారుడు మల్లికార్జున్ ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నాడని, ఇతనికి రెండు ఎకరాల పొలం ఇచ్చామన్నారు. చిన్న కుమారుడు విద్యుత్ శాఖలో లైన్‌మన్‌గా పని చేస్తున్నాడని, అతనికి ఎకరంన్నర ఇచ్చామని తెలిపారు. భూమి కొనుగోలు సమయంలో రూ.10లక్షల అప్పు అయ్యిందని, అప్పు తాము తీర్చలేని పరిస్థితుల్లో ఉన్నామన్నారు. భూము లు తీసుకున్న కొడుకులు అప్పు మాత్రం కట్టడం లేదని, పైగా తమ పోషణకు కూడా సహ కరించడం లేదన్నారు. దీనిపై స్పందించిన సీపీ కుమారులను పిలిపించి సమస్య చట్ట ప్రకా రం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ వృద్ధుల విషయంలో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకునేలా పార్లమెంట్ చట్టం తీసుకువచ్చింద న్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను పట్టించుకోకుంటే పిల్లలకు సంక్రమించిన ఆస్తుల ను స్వాధీనం చేసుకుని తల్లిదండ్రులకు అప్పగిస్తామని రామగుండం పోలీస్ కమిషనర్, ఐజీ శ్రీనివాస్ హెచ్చరించారు.

బలహీన వర్గాలను వంచించిన కాంగ్రెస్

కథలాపూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్ర జ్యోతి) : కులగణన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాలను వంచించిందని బీసీ సంక్షేమసంఘ జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్ ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలు 98 శాతం ఉన్నారని తప్పుడు లెక్కలు చూపి తీవ్ర అన్యాయం చేశారని అన్నారు. బీసీ వర్గాలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని అన్నారు.

ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు విచారణ

ముత్తారం, ఫిబ్రవరి 06 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని ఓడేడు గ్రామపంచాయతీ పరిధిలో గురువారం గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే ఈనెల 4న ఎల్లమ్మ బోనాలలో గ్రామానికి చెందిన దాసరి అఖిల్‌సాయి, దాసరి పురుషోత్తం అనే ఇద్దరు వ్యక్తులు గొడవ పడుతుండగా భీముని నాగేష్ అనే వ్యక్తి వారిని వారించాడు. గొడవ సద్దుమణిగించే ప్రయత్నం చేసి ఇంటికి వెళ్ళగా అఖిల్‌సాయి మరొకరి సెల్ ఫోన్ నుంచి నాగేష్ కు ఫోన్ చేసి బూతులు తిట్టాడు. నాగేష్ అఖిల్‌సాయి ఇంటికెళ్లి ఎందుకు తిట్టావు అని అడగగా వారిద్దరి మధ్య గొడవ పెరిగింది. ఈక్రమంలో అఖిల్ సాయి వద్ద కల్లుగీత కత్తితో నాగేష్ మెడపై దాడి చేశాడు. నాగేష్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా గురువారం ఏసీపీ విచారణ చేపట్టారు విచారణ అనంతరం పూర్తి నివేదికను తాధికారులకు సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు. బాధితుడు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



వేములవాడలో శివదీక్షలు స్వీకరిస్తున్న భక్తులు

శివోహం..

- రాజన్న క్షేత్రంలో వెల్లివిరుస్తున్న భక్తిభావం..
- ప్రతియేటా పెరుగుతున్న శివదీక్షాపరులు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి, జగజ్జనని శ్రీరాజరాజేశ్వరీదేవిలు అశేష భక్తుల కొంగుబంగారంగా విశేష పూజలు అందుకుంటున్నారు. శివదీక్ష తీసుకుని మండల కాలం స్వామివారిని పూజిస్తే తమ బాధలు తొలగి శివుని ఆశీస్సులు లభిస్తాయని భక్తులు నమ్మకం. ఏటా మహాశివరాత్రికి శివదీక్షలు తీసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. సుమారు 800 మంది వరకు శివదీక్ష తీసుకుంటారని తెలుస్తోంది. మండల కాలం(41) దీక్ష చేస్తే శ్రేష్ఠమైనదిగా చెబుతున్నప్పటికి అర్ధమండలం (21)దీక్షతో పాటుగా ముందుగా వేసుకునే భక్తులు 11 రోజులపాటు శివదీక్ష తీసుకుంటున్నారు.

నియమాలు ఇవీ..

శివదీక్షను స్వీకరించిన స్వాములు గోధుమ వర్ణం గల వస్త్రాలను ధరించాలి. మగవారు వయస్సుతో సంబంధం లేకుండా ఈ దీక్షను స్వీకరించవచ్చు. సూర్యోదయ, సూర్యాస్తమయ సమయంలో చన్నీటితో తల స్నానం ఆచరించాల్సి వుంటుంది. ప్రాతఃకాలం, ప్రదోష వేళలో పూజ ఆచరించాల్సి వుంటుంది. ఒకపూట భోజనం చేసి, నేలపై నిద్రించాలి. మత్తు పదార్థాలు, మాంసాహారం వదిలిపెట్టాలి. దీక్షను స్వీకరించిన స్వాములు మిత భాషణ, వీలైనంత మౌనం తప్పక పాటించాల్సి వుంటుంది.

దీక్షా విరమణ...

వేములవాడ శ్రీరాజరాజేశ్వర క్షేత్రానికి శివదీక్ష స్వాములు బయలుదేరే రోజు స్థానిక శివాలయంలో అర్చకులతో రాజన్న జ్యోతిర్ముడి కట్టించుకోవాలి. జ్యోతిర్ముడిని శిరస్సుపై ధరించి ఆలయానికి బయలుదేరుతారు. జ్యోతిర్ముడిని విప్పిన తర్వాత అందులోని పూజాద్రవ్యాలను స్వామి పూజకు సమర్పించాలి. ముడుపులను హుండీలో వేయాలి. మహాశివరాత్రి రోజున లింగోద్భవ సమయం అనంతరం శ్రీస్వామి వారికి శివ దీక్ష స్వాములు అభిషేకం చేసి స్థానిక భీమేశ్వర ఆలయంలో అర్చకుల నేతృత్వంలో దీక్షావిరమణ గావిస్తారు.



శివదీక్షస్వాముల శోభాయాత్ర(ఫైల్)

ఈశ్వరారాధనం.. ఐశ్వర్య సాధనం..

గుంటి కనుకయ్య, గురు స్వామి, వేములవాడ



కుబేరుడు సైతం శివదీక్ష తీసుకుని ఈశ్వరుడిని ఆరాధించి మహా సంపన్నుడైనట్లు చరిత్రలో విన్నాను. నాకు ఎంతకూ వివాహం కాకపోవడంతో 1995లో శివదీక్ష తీసుకున్నాను. శివదీక్ష చేపట్టిన తరువాత నాకు వివాహం జరిగింది. నేను కోరుకున్నది తప్పకుండా జరుగుతుంది.

శివ భక్తులకు ట్రస్ట్ ఉచిత బిక్షను కల్పిస్తున్నాము..

రాపెల్లి శ్రీధర్, గురుస్వామి, వేములవాడ



వేములవాడ క్షేత్రంలో ప్రతియేటా శివదీక్ష తీసుకునే శివస్వాములకు శ్రీపార్వతిరాజరాజేశ్వర శివదీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా బిక్ష సదుపాయాన్ని కల్పిస్తున్నాం. భక్తుల నుంచి విరాళలను సేకరించి నిత్యం 400 మంది వరకు ఉచితం గా భోజనం సౌకర్యం కల్పిస్తున్నాము.



అనుకున్నది జరుగుతుందనే శివదీక్ష తీసుకుంటున్నాను..

చౌటపల్లి శ్రీకాంత్, శివదీక్ష స్వామి, వేములవాడ

శివదీక్ష తీసుకుంటే అనుకున్నది జరుగుతుందనే నమ్మకంతో గత సంవత్సరం దీక్ష తీసుకున్నాను. అనుకున్నది జరిగింది. అందుచేత ప్రతి సంవత్సరం శ్రీస్వామివారిని ఆరాధించేందుకు అర్ధమండల దీక్ష తీసుకుంటున్నాను. శివదీక్షలో ఉంటే ఆధ్యాత్మికతతో మనస్సు ప్రశాంతంగా వుంటుంది.



రాజన్న సేవలో 'జబర్దస్త్' నటులు



జబర్దస్త్ నటులకు చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని గురువారం జబర్దస్త్ నటులు సుడిగాలి సుదీర్, ఆటో రాంప్రసాద్‌లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు వారిని ఆశీర్వదించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్న సుడిగాలి సుధీర్

బోయినపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి మండలం వర్ధవెల్లి గ్రామ శివారులోని శ్రీదత్తాత్రేయ స్వామివారిని కమెడియన్లు సుడిగాలి సుదీర్, రాంప్రసాద్ గురువారం దర్శించుకున్నారు. బోట్ ద్వారా గుట్టపైకి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సంయుక్త కార్యదర్శి నాగుల సాంబయ్య వారికి స్వాగతం పలకగా, అర్చకులు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి ఆశీర్వచనం చేశారు.

ఎస్‌యూ పీజీ పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేట్ పరీక్షల ప్రణాళికను గురువారం విడుదల చేసింది. మొదటి సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 17వ తేదీ నుంచి 21 తేదీ వరకు జరుగనున్నాయి. ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ మొదటి సెమిస్టర్ పరీక్షలను రెగ్యులర్, బ్యాక్‌లాగ్ అభ్యర్థుల కోసం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని లేదా ఆయా కళాశాలలో సంప్రదించవలసిందిగా శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షలు నియంత్రణ అధికారి తెలిపారు.

యూరియా కొరతతో రైతుల ఇక్కట్లు



పెగడపల్లిలో యూరియా కోసం దుకాణం ఎదుట వేచి ఉన్న రైతులు

పెగడపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలంలో వారంరోజులుగా యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

యూరియాకోసం నిత్యం సింగి ల్‌విండో గోదాములు, ప్రైవేటు దుకాణాల చుట్టూ తిరిగిపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. మండలంలో 95శాతానికి పైగా వరిసాగు కాగా, సరైన సమయంలో యూరియా చల్లకపోతే పంటదిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం ఉదయం సింగిల్‌విండోతో పాటు ప్రైవేటు దుకాణానికి రెండులారీల యూరియా రాగా రైతులు వేకువజామునుంచే ఆయా గోదాముల ఎదుట బారులు తీరారు. వచ్చిన యూరియా కొంతమంది రైతులకే అందగా మిగిలినవారు ఉసూరుమంటూ వెనుదిరిగారు. యూరియాతో పాటు నానో యూరియా లేదా మరోరకం కొనుగోలు చేస్తేనే యూరియా స్టాక్‌ఇస్తామంటూ బలవంతంగా అంటగడుతున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్‌ను వివరణ కోరగా అలాంటి విషయం తమ దృష్టికిరాలేదని, రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే సంబంధిత దుకాణాలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

గీత కార్మికుడి మృతి

మల్లాపూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్ర జ్యోతి) : ఈత చెట్టుపై నుంచి జారిపడి చికిత్స పొందుతున్న మండలంలోని సాతారం గ్రామానికి చెందిన రూత్తే గంగనర్సయ్య(63)అనే గీత కార్మికుడు గురువారం మృతిచెంది నట్లు ఎస్సై రాజుకుమార్ తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రూత్తే గంగనర్సయ్య ఈనెల 3న ఈత వనంలో కల్లు గీస్తుండగా జారి పడి కింద పడ్డాడు. దీంతో చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న రూత్తే గంగనర్సయ్య గురువారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య రూత్తే లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు 15 నామినేషన్లు

కరీంనగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు 15 నామినేషన్లు దాఖలయ్యాయి. గురువారం కలెక్టరేట్‌లో 12 మంది పట్టభద్రుల, ముగ్గురు ఉపాధ్యాయుల ఎమ్మెల్సీకి నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలాసత్పతికి అందజేశారు. పట్టభద్రుల స్థానానికి ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు (విద్యానగర్, కరీంనగర్) తరఫున పచ్చునూరి సురేందర్, లంటు చంద్రశేఖర్ (కంది, సంగారెడ్డి), మేకల అక్షయ్ కుమార్ (చింతగూడ, మంచి ర్యాల), అబ్బగోని అశోక్‌గౌడ్ (చిట్టాపూర్, నిజామాబాద్), దేవతి శ్రీనివాస్ (వడగల్, నిజామాబాద్), రైకల సైదులు (పెరుండేవి గూడెం, నల్గొండ), గుయ్య సాయికృష్ణమూర్తి (గుండంపల్లి, జగి త్యాల), ఎడ్ల సాయికృష్ణప్రియ (కరీంనగర్), దొడ్ల వెంకటేశం (సదాశివపేట, సంగారెడ్డి), కొమిరెడ్డి మహేశ్ (మంచిర్యాల), గడ్డం శ్రీనివాస్‌రెడ్డి (నిజామాబాద్), వేముల విక్రమ్‌రెడ్డి (కొనునూరుపల్లి, జగిత్యాల) నామినేషన్లను ఎన్నికల అధికారికి సమర్పించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి మామిడి సుధాకర్‌రెడ్డి (ఎల్లుపేట -మెదక్), మల్కా కొమురయ్య (ఈస్ట్‌మారెడుపల్లి -సికింద్రాబాద్), వై.అశోక్‌కుమార్ (న్యూ మల్కాపూర్, సంగారెడ్డి) నామినేషన్లను వేశారు. అలాగే ఇదివరకే నామినేషన్లు వేసిన కట్ల ఆశమ్మ, కంటె సాయన్న, సిలివేరి శ్రీకాంత్ ఈరోజు మరోసెట్ నామినేషన్లను అందజేశారు. ఇప్పటి వరకు 21 మంది పట్టభద్రుల, మొత్తం ఏడుగురు టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్లు వేశారు.

ఉపాధ్యాయుల సంక్షేమం కోసమే ఎన్నికల బరిలో

- బీజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమురయ్య



మీడియాతో మాట్లాడుతున్న మల్కా కొమురయ్య

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాలకుల నిర్లక్ష్యంతో గత కొన్నేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారి సంక్షేమాన్ని కాంక్షించే మండలి బరిలో దిగినట్లు ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి మల్కా కొమురయ్య అన్నారు. గురువారం ఆయన కరీంనగర్‌లో నామినేషన్ దాఖలు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే ఉపాధ్యాయుల పట్ల పాలక ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. అందుకు నిదర్శనమే ఏడాది కాలంగా ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా బాండ్లను ఇస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రధాన డిమాండ్ సీపీఎస్ రద్దు చేయడానికి అన్ని వర్గాలను కలుపుకొని పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం కొనసాగిస్తున్న హెల్త్‌కార్డుల పనితీరును మెరుగుపరచడానికి కృషి చేస్తానన్నారు. కస్తూర్బాగాంధీ విద్యాసంస్థల్లో విధులు నిర్వహిస్తు న్నవారు, మోడల్ స్కూలులో పనిచేస్తున్న ఉద్యోగులకు జూనియర్, డిగ్రీ ఎంఈవోలు, డిప్యూటీ డీఈవోలుగా పదోన్నతులకు ఉద్యమిస్తామన్నారు. ఆయనతోపాటు బీజేపీ తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు, మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌కుమార్‌కు బీటీఎఫ్ మద్దతు



అభివాదం తెలుపుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్‌కుమార్, బీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వై అశోక్‌కుమార్‌కు బహుజన టీచర్స్ ఫేడరేషన్(బీటీఎఫ్) పక్షాన మద్దతు తెలుపుతున్నామని రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము రమేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందుల సైదులు తెలిపారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో మాట్లాడుతూ అశోక్‌కుమార్ సామాజిక స్పృహ కలిగిన వ్యక్తి, ఉద్యమనేత, బీసీ నాయకుడని తెలిపారు. అంతేకాకుండా టీపీటీఎఫ్ మాజీ అధ్యక్షుడని ఉపాధ్యాయుల సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉన్న వ్యక్తి అని అన్నారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు చెందిన బీటీఎఫ్ అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు, అభిమానులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

మామిడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- మెళకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చంటున్న శాస్త్రవేత్తలు



జమ్మికుంట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మామిడి ప్రస్తుతం పూత నుంచి పిందెలుగా మారేదశలో ఉంది.. కరీంనగర్ జిల్లాలో ఏడు వేల ఎకరాల్లో మామిడి సాగు అవుతోంది. చిన్నచిన్న పిందేలతో ఉన్న మామిడి తోటలు రైతులకు ఆశలు రేకెత్తిస్తున్నాయి. ఈ సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే అధికదిగుబడులు పొందే అవకాశాలున్నాయని జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

మామిడిని ఆశించే పురుగులు, తెగుళ్ల నివారణలు..

● తేనె మంచు పురుగు:

ఈ పురుగు రసాన్ని పీల్చడం వల్ల పూత పిందె రాలుతుంది. నివారణకు చిన్నచిన్న పిందెలపై గీకిన రంగు కనిపిస్తే ప్రొఫెనోఫాస్ మందును 1.5 మిల్లీలీటర్లు, ఇమిడాక్లోప్రిడ్ మందు ఒక మిల్లీలీటర్, థయో మిథాక్సం మందు 0.5గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి.

● తామర పురుగులు



● ఈ పురుగులు సోకిన పిందెల్ల రంగు మారి బీటలు వారి రాతి మంగు వలె ఏర్పడుతుంది. నివారణకు పిందె దశలో 0.3మి.లీ. స్పైనోసాడ్ లీటర్ నీటికి 3 మి.లీ. కలిపి పిచికారి చేయాలి.

ఆకు జల్లెడ గూడు పురుగు

● ఈ పురుగు లార్వాలు ఆకుల ఈనెల మధ్య ఉన్న కణజాలాన్ని తినేస్తాయి. ఆకుల్ని జల్లెడలాగా చేసి గూడు ఏర్పచుకుంటుంది. నివారణకు క్వినాల్‌పాస్ 2మి.లీను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

● రైతులు గుర్తుంచుకోవాల్సిన విషయాలు..

- ఒక్కో పుష్ప గుచ్ఛంలో ఆరు లేదా, ఆపై పిందెలు ఏర్పడిన తర్వాత పూత రాలి పోతుంది.
- మగ, వంధ్య పూలు రాలిపోవడంతో పూత మొత్తం రాలుతుందని ఆందోళన చెంది మందులు పిచికారి చేయవద్దు. ప్రతి రోజు ఉదయం 8గంటల సమయంలో పూతను, పిందెలను గమనించాలి.
- ఆకు జల్లెడ పురుగును కర్రలను ఉపయోగించి తీస్తే పూత రాలి పోతుంది.
- చెట్లలో పూత కొమ్మల్లో పిందెలు ఆరు దాటి ఫలదీకరణం చెందితే నీరు అందించాలి.
- గాలి బాగా వీస్తున్న సమయంలో మం దులు పిచికారి చేయవద్దు. మందులు పిచి కారి చేస్తున్నప్పుడు జిగురు (గమ్)ని తప్పని సరిగా కలుపుకోవాలి.
- పూత, కాత నిలవడానికి ప్లానోఫిక్స్ మందుని లీటరు నీటికి 0.3 మిల్లీలీటర్లను కలిపి పిచికారి చేయాలి. పిందెలు ఏర్పడ టానికి బోరాన్ మందు 1 గ్రాము, పిందెలు పెరుగడానికి 20:20:20లేదా 13:0:45ను 10 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి.

టెంక పురుగులు..

● ఎండు పుల్లల్లో రెక్కల పురుగు వెలువడి కాయలపై గుడ్లు పెడుతాయి. పెరిగి న లార్వాలు కాయలోనికి చొచ్చుకుపోతాయి. నివారణకు పిందెలపై వేపనూనె 3మి.లీ., క్లోరోపైరిఫాస్ 2.5మి.లీ. లీటర్ నీటికి కలిపి సాయంత్రం వేళల్లో పిచికారి చేయాలి.



● రైతులు జాగ్రత్తలు పాటించాలి



ప్రస్తుతం తోటలన్నీ పిందెలతో ఉన్నాయి. చెట్ల దగ్గరకి నీళ్ల ఇవ్వడం వల్ల బూడిద తెగులు సోకే అవకాశం ఎక్కువగా ఉంది. చెట్లు మొదళ్ల వరకు నీళ్ల ఇవ్వకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి. దోమ కూడా ఎక్కువయ్యే అవకాశం ఉంది. మామిడి కాయకు పండు ఈగ సోక కుండా ఫ్రూట్ కవర్స్, పండు ఈగ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. మందులను పిచికారి చేసే సమయంలో కాయలు రాలకుండా జాగ్రత్తలు పాటించాలి.


- గుడిపెల్లి వేణుగోపాల్, కేవీకే శాస్త్రవేత్త

'మహాశివరాత్రి' జాతర ఏర్పాట్లపై ఆర్టీసీ ఆర్‌ఎం సమీక్ష

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రయాణికుల కోసం ప్రత్యేక బస్సులు, సౌకర్యాల ఏర్పాట్లపై ఆర్టీసీ రీజినల్ మేనేజర్ (ఆర్‌ఎం) ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గురువారం స్థానిక బస్ స్టేషన్ ఆవరణలోని సమావేశమందిరంలో కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి.రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రీజియన్ పరిధిలోని 11డిపో మేనేజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని ప్రసిద్ధ శైవ క్షేత్రాలైన వేములవాడ, కాళేశ్వరం, వేలాల, దుబ్బరాజన్న, పొట్లపల్లి తదితర దేవాలయాలకు మహాశివరాత్రి జాతర సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలి వెళ్తారని, భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపించాలని డిపో మేనేజర్లకు ఆర్‌ఎం సూచించారు.

ఈ సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు కె.సత్యనా రాయణ (మెకా నికల్), ఎస్.భూపతిరెడ్డి (ఆపరేషన్స్), పర్సన ల్ ఆఫీసర్ ఎం.చంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ జి.మనోహర్‌రెడ్డి, డిపోమేనేజర్లు నాగభూషణం (గోదావరిఖని), వెంకటేశ్వర్లు (హుస్నాబాద్), రవీంద్రనాథ్ (హుజురాబాద్), విజయమాధురి (కరీంనగర్-1), మల్లయ్య (కరీంనగర్-2), సునిత (జగిత్యాల), మనోహర్ (కోరుట్ల), దేవరాజు (మెట్‌పల్లి), ప్రకాశ్‌రావు (సిరిసిల్ల), శ్రీనివాస్ (వేములవాడ), ఏంజెల్, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్-మంథని) పాల్గొన్నారు.

రేపటి నుంచి నల్లగొండ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు



నల్లగొండలో స్వామి వారు వెలసిన ఎత్తైన గుట్ట

కొడిమ్యాల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కొడి మ్యాల మండలం నల్లగొండ గ్రామంలోని ఎత్తైన గుట్టపై వెలసిన శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 8నుంచి 12 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఉడుతల వెంకన్న తెలిపారు. శనివారం ఉదయం పుణ్యహవచనం, ఋత్విక వరుణం, అంకురార్పణం, అగ్ని ప్రతిష్ఠ, సాయంత్రం బేరిపూజ, 9న ఆరాధన ధ్వజారోహణ హవనం, బలిహరణం, గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు, 10న శ్రీలక్ష్మీనృసింహ స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. 11న గజ, అశ్వ వాహ నాలపై స్వామివారల ఊరేగింపు, 12న ఉద యం7 గంట నుంచి(పౌర్ణమి)రథంపై స్వామి వారి దర్శనం, సాయంత్రం నాలుగు గంట లకు రథం తిరుగుట కార్యక్రమాలు ఉంటా యని ఈవో తెలిపారు. బ్రహ్మోత్సవాలను పుర స్కరించుకుని జగిత్యాల, వేములవాడ ఆర్టీసీడి పోల నుంచి బస్సులు ప్రత్యేకంగా నడుపు తారు. విద్యుత్, నీటి, వైద్య వసతులను భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

నత్తనడకన రహదారి పనులు

-రూ.3.29 కోట్లతో ఏడాదిన్నర క్రితం ప్రారంభం -పూర్తి కాక ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కంకర లేచి ప్రమాదకరంగా మారిన రహదారి



రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే(ఫైల్)

మల్యాల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మల్యాల శివారులో నుంచి సర్వాపూర్, బల్వంతాపూర్ మీదుగా కరీంనగర్-జగిత్యాల మార్గం వరకు చేపట్టిన రహదారి పనులు నత్తనడకన సాగుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2023 మేలో రూ.3.29కోట్ల అంచనా వ్యయంతో సుమారు 7కి.మీ పనులకు శంకుస్థాపన జరగ్గా బల్వంతాపూర్‌లో రహదారి విస్తరణ, విద్యుత్ స్తంభాల పక్కకు తరలింపు, మురుగు కాలువల పనులు చేపట్టారు. అనంతరం రహదారిపై సీసీ పనులు ప్రారంభించకపోవడంతో గ్రామంలో కంకర లేచి ప్రమాదకరంగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పనుల్లో జాప్యంపై గత సెప్టెంబరులో గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అయినప్పటికీ పనుల్లో ప్రగతి అంతంత మాత్రంగానే ఉంది. దీంతో కొద్దిరోజుల క్రితం గ్రామానికి ఎమ్మెల్యే రాగా మరోసారి రహదారి పనుల గురించి ఆయన దృష్టికి స్థానికులు తీసుకువచ్చారు. దీంతో అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు అసంపూర్తిగా ఉండడంతో కంకర లేచి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పనులు త్వరగా పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● ప్రమాదాలు జరుగుతున్నాయి

-మిడిదొడ్డి హరీశ్, బల్వంతాపూర్



పనులు అసంపూర్తిగా ఉండడంతో ప్రమాదాలు జరుగు తున్నాయి. రహదారి పనులు పూర్తి అయితే ఇబ్బందులు తప్పుతాయి. సర్వాపూర్, బల్వం తాపూర్ గ్రామాల ప్రజలకే కాకుండా అనేక మందికి ఈ రహదారి సౌకర్యంగా మారనుంది. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలి.

చర్యలు తీసుకుంటున్నాం

-సత్యనారాయణ, డీఈ, ఆర్అండ్‌బీ

పనులు త్వరలోనే ప్రారంభం అవుతాయి. బల్వంతాపూర్ గ్రామంలో కంకర పనులు పూర్తి అయిందున సీసీ పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. సామగ్రి కూడా అందు బాటులో ఉంది. ప్రజలకు అసౌకర్యం కలగకుండా పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాయికల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపూర్ 33 కేవీ ఫీడర్‌లో పెండింగ్ పనుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొన్నారు. వీరాపూర్ 33/11 కేవీ, ఇటిక్యాల 33/11 కేవీ, ఒడ్డెలింగాపూర్ 33/11 కేవీ, తాట్లవాయి 33/11 కేవీ గ్రామాలకు సరఫరా చేసే 33 కేవీ వీరాపూర్ ఫీడర్‌లో పెండింగ్ పనుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వివాహానికి ఆర్థిక సహాయం

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన పేదింటి యువతి వివాహానికి పట్టణానికి చెందిన శ్రీ భక్త మార్కండేయ స్వచ్ఛంద సేవా సమితి వారి 10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పట్టణంలోని గీతా సిల్క్ హౌస్ అధినేత కస్తూరి శశిధర్ పెళ్ళి పట్టు చీరను అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చిలుకమారి శ్రీనివాస్, కొక్కుల సుదర్శన్, ఆకుబత్తిని శ్రీనివాస్, కోమాకుల సుదర్శన్, మనపూరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఫ్యాన్లు వితరణ

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం పొరండ్ల అంగన్‌వాడి కేంద్రానికి గ్రామానికి చెందిన ఉడుగుల స్వామి - రమ్య దంపతులు రెండు ఫ్యాను ఇచ్చారు. తమ కూతురు నైమిష పుట్టిన రోజును పురస్కరించుకొని అంగన్‌వాడి చిన్నారుల సౌకర్యార్థం ఫ్యాన్లు అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ పల్లికొండ శారద, ఏఎన్ఎం సుగుణ, విజయలక్ష్మి, పద్మ, లావణ్యలు ఉన్నారు.

మాల సంఘం గ్రామ అధ్యక్షుడిగా అనిల్

కొడి మ్యాల, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడూర్ గ్రామ మాల కుల సంఘం అధ్యక్షునిగా ఆకుల అనిల్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా తాటి సుధాకర్, కోశాధికారిగా నాపారి ప్రవీణ్, కార్యవర్గ సభ్యులుగా పుట్ట సాయి, నాపారి మధు, తాటి రాజేశం, క్యాదాసి ప్రణయ్, పరిపాటి అశోక్, తాటి రమేష్‌ను ఎన్నుకున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

భీమారం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలువురి కుటుంబాలను టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్, భీమారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డి గురువారం పరామర్శించారు. మండలంలోని దేశాయిపేట గ్రామానికి చెందిన మేడిచెల్మెల రాజేశంకు ఆపరేషన్ కాగా పరామర్శించారు. అలాగే కమ్మరిపేట గ్రామానికి చెందిన వన్నెల ధర్మాగౌడ్ గుండెపోటుతో మరణించగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మన్నెగూడెం మాజీ సర్పంచ్ తేలు నరేష్; ఉరుమడ్ల లక్ష్మణ్, చుక్క తిరుపతి, చెక్కపెల్లి సంజీవ్ ఉన్నారు.

మార్కెట్‌యార్డులో కొనుగోళ్లకు మోక్షమెప్పుడో?

-పాలకవర్గ కమిటీల నియామకాలకే పరిమితమైన పెగడపల్లి మార్కెట్ యార్డు



పెగడపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయం

పెగడపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్ యార్డు ఏర్పాటై తొమ్మిదేండ్లయినా పెగడపల్లిలో నేటికీ కొనుగోళ్ల ప్రారంభం కాలేదు. శ్రీరాంసాగర్ ఆయకట్టు ప్రాంతమైన పెగడపల్లి మండలంలో ప్రతి యేటా రెండు పంటలు విరివిగా పండుతాయి. పంటలు విక్రయించుకునేందుకు పెగడపలి మార్కెట్ యార్డులో కొనుగోళ్ల లేక చొప్పదండి, గొల్లపల్లి మార్కెట్‌లకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్‌కు అనుబంధంగా ఉన్న పెగడపల్లి మండలానికి 3 సెప్టెంబరు 2015న పెగడపల్లి వ్యవసాయ మార్కెట్ పేరిట స్వయం ప్రతిపత్తి గల మార్కెట్‌గా ప్రకటించారు. రూ.కోటి వెచ్చించి 2500 మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణం చేయడంతో పాటు రూ.40 లక్షలు వెచ్చించి మార్కెట్ కార్యాలయం నిర్మాణం, రూ.30 లక్షలు వెచ్చించి ప్రహరీ నిర్మాణం చేశారు. 2018 నుంచి మూడు పర్యాయాలు మార్కెట్ కమిటీకి పాలక వర్గాల నియామకం చేయడం వాటి పదవీకాలం ముగిసి పది నెలలుగా పర్సన్ ఇంచార్జి పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మార్కెట్ యార్డు ఏర్పాటైన దగ్గరి నుంచి నేటికీ కొనుగోళ్ల ప్రారంభించలేదు. కమిటీల నియామకంతో గౌరవ వేతనాలు, విహారయాత్రల పేరుతో లక్షల రూపాయల సొమ్ము వృథా అయింది తప్ప రైతాంగానికి ఉపయోగపడింది ఏమీ లేదని వారు వాపోతున్నారు. కేవలం వరి ధాన్యం మాత్రమే సింగిల్‌విండో, ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేస్తుండగా మొక్కజొన్న, పత్తి, వేరుశనగ, మిర్చి, పసుపు, నువ్వులు తదితర పంటలు సాగు చేసిన రైతులు గొల్లపల్లి, చొప్పదండి మార్కెట్‌లకు తీసుకెళ్లి విక్రయించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పెగడపల్లి వ్యవసాయ మార్కెట్‌ను కేవలం కమిటీల నియామకాలకే పరిమితం చేయకుండా క్రయవిక్రయాలు ప్రారంభమయ్యేలా అధికారులు , ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

వ్యాపారులు ముందుకు రావడం లేదు

-ఎండి ఫైజుద్దీన్, మార్కెట్ కార్యదర్శి

మార్కెట్‌లో అన్ని వసతులు ఉన్నా ట్రేడరు లైసెన్సు తీసుకునేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. వ్యాపారులకు అవగాహన కల్పించి లైసెన్సులు జారీ చేసి కొనుగోళ్లు జరిపేందుకు కృషి చేస్తాం.

సింగిల్‌విండో కార్యాలయాన్ని సందర్శించిన జేడీహెచ్

కొడిమ్యాల, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడూర్ సింగిల్‌విండో కార్యాలయాన్ని హార్టికల్చర్ జేడీహెచ్ బాబు సాయంత్రం సందర్శించారు. సింగిల్ విండో పరిధిలోని గ్రామాల్లోని కూరగాయాలు, మామిడి తోటలు, ఫాం ఆయిల్ తోటలు సాగు చేస్తున్న రైతులతో పలు అంశాలను చర్చించారు. జేడీహెచ్ వెంట సీడ్ ప్రొక్యూర్మెంట్ సెంటర్ ప్రొప్రైటర్ జుబేరా హుస్సేన్, కమ్మర్‌పల్లి టర్మరిక్ రిసెర్చ్ స్టేషన్ నాప్కాన్ ప్రతినిధి, ఉద్యానవన జిల్లా ఇన్‌చార్జ్ అధికారి దేవాప్రసాద్ ఉన్నారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై పోలీసులకు ఫిర్యాదు

కొడి మ్యాల, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి) : రెడ్డి సామాజిక వర్గాన్ని కించపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌లో మండల రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గడ్డం చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఎస్సై సందీప్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ కొంత కాలం నుంచి వరంగల్ సమావేశంతో పాటు, టీవీ కార్యక్రమాలలో నవీన్‌రెడ్డి సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నా డన్నారు. గ్రామాలలో తామంతా అన్ని కులాల వారితో కలిసి మెలిసి ఉండగా ఇలాంటి వ్యాఖ్యలు చేయటం సరికా దన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో సంఘం నాయకులు ఊటుకూరి మల్లారెడ్డి, అనుమండ్ల అజయ్‌రెడ్డి, మందల గోపాల్‌రెడ్డి, కిషన్‌రెడ్డి ఉన్నారు.

రైస్‌మిల్లర్లు బ్యాంక్ గ్యారెంటీ చెల్లించాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో పౌర సరఫరాల శాఖ కమిషనర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

జగిత్యాల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్లర్లు ఖరీఫ్ 2024-25లో దిగుమతి చేసుకున్న వరిధాన్యానికి 10 శాతం బ్యాంక్ గ్యారెంటీ వెంటనే సమర్పించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. 2024-25 యాక్షన్ ప్లాన్ ఖరీఫ్, రబీ 2023-24, ఖరీఫ్ 2024-సీఎంఆర్ చెల్లింపులు, కొత్త రేషన్ కార్డులు, రేషన్ కార్డుల్లో కొత్త పేర్లు చేర్చుటతో పాటు సోషల్ ఆడిట్‌పై చర్చించి తగిన సూచనలు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బీఎస్ లత, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే ఉద్యోగులకు గుర్తింపు

-డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులు అంకితభావంతో పని చేసినప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందని జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్ అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తించి పదోన్నతి, బదిలీపై వెళ్లిన సిబ్బందికి ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ఉదయ్ ప్రసాద్, విజయరాణి, ఉష, లలిత, సత్యనారాయణ, వెంకటేష్, మహేశ్వరిలను జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్, డాక్టర్ ఎ శ్రీనివాస్‌లు ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ఉద్యోగ బాధ్యతలతో పాటు సేవ దృక్పధం కలిగి ఉండాలని అన్నారు. వైద్య శాఖలో ఉద్యోగం చేయడం వరంగా భావించాలని తెలిపారు. ప్రతి ఒక్కరు అంకితభావంతో పని చేసి గుర్తింపు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరీష్ కుమార్, రవీందర్, రామ్మోహన్, వెంకటరమణ, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆలయం



ముస్తాబైన లక్ష్మీనర్సింహస్వామి ఆలయం

పెగడపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని లింగాపూర్ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 8 నుండి 12 వరకు బ్రహ్మోత్సవాలు జరుగనుండగా ఆలయాన్ని రంగులు వేసి రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉత్సవాలలో బాగంగా ఈ నెల 8న భగవత్ పుణ్యాహవచనం, నందదీప స్థాపన, స్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవం, అగ్ని ప్రతిష్ఠ, 9న నిత్య హోమం, బలిహరణ, తీర్థ ప్రసాద వితరణ, 10న కుంకుమార్చన, హోమం, సదస్య మహాదాశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ, 11న అన్న ప్రసాదం, దీపోత్సవం, ఎడ్ల బండ్ల పోటీలు, 12న స్వామి వారి రథోత్సవం, స్వామి వారి దర్శనం, ఏకాంత సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి బ్రహోత్సవాలను విజయవంతం చేయాలని కమిటీ చైర్మన్ మల్లయ్య, కమిటీ సభ్యులు కోరారు.

పశువుల బెడదతో ఇక్కట్లు

● పట్టించుకోని మున్సిపల్ అధికారులు



ధర్మపురి ప్రధాన రహదారిపై సంచరిస్తున్న ఆవులు

ధర్మపురి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో పశువుల బెడద అధికమయ్యింది. దీంతో వాహనదారులు నిత్యం అనేక మంది ప్రమాదాలకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోవటం లేదని పలువురు ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణంలో సుమారు 20 వేల వరకు జనాభా ఉంది. ధర్మపురి ప్రముఖ పుణ్యక్షేత్రంగా, నియోజకవర్గ కేంద్రంగా, మున్సిపాలిటీగా పేరొందింది. ఇక్కడికి నిత్యం అనేక మంది భక్తులు, ప్రజలు వివిధ వాహనాలద్వారా దైవదర్శనానికి, పనుల నిమిత్తం వస్తుంటారు. ఇక్కడ ప్రధాన రహదారులపై నిత్యం ఆవులు సంచరించడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు. పట్టణంలోని బస్‌స్టేషన్‌లో, నంది విగ్రహ చౌరస్తా, గాంధీచౌక్, పెద్ద హనుమాన్ విగ్రహం వరకు గల ప్రధానరహదారుల వరకు ఆవుల సంచరిస్తున్నాయి. దీనివల్ల ప్రయాణికులు, వాహన చోదకులు, కాలినడకగా వెళ్లే ప్రజలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటను పశువుల యజమానులకు నోటీసులు ఇచ్చి, ప్రధాన రహదారుల పై తిరగకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పశువుల యజమానులకు నోటీసులు ఇచ్చాం

-శ్రీనివాస్, ధర్మపురి మున్సిపల్ కమిషనర్

పట్టణంలో సంచరిస్తున్న పశువుల యజమానులను గుర్తించి నోటీసులు ఇచ్చాం. త్వరలో ఒక మీటింగ్ ఏర్పాటు చేస్తాం. పశువులను పట్టణంలో తిరగకుండా యజమానుల ఇంటికి పంపించేలా చర్యలు తీసుకుంటాం.

మెగా వైద్య శిబిరం

కోరుట్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మున్సిపల్‌లో మోగా వైద్య శిబిరం ప్రభుత్వ వైద్య సిబ్బంది, వైద్యులు నిర్వహించారు. గురువారం డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ సునితారాణి ఆధ్వర్యంలో మోగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పారిశుద్య కార్మికులకు, సిబ్బందికి వైద్య పరీక్షలను చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యంపై తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ తిరుపతి, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు వినోద్ కుమార్, జ్యోతిలయ, సృతిలయ, శ్రావణి పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన కలిగి ఉండాలి

క్షయవాది నివారణపై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాస్ అన్నారు. గురువారం క్షయవాది నిర్ధారణ పరీక్షలను మున్సిపల్‌లో జరిగిన మోగా వైద్య శిబిరంలో నిర్వహించి వ్యాధి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను మున్సిపల్ కార్మికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీర్‌పూర్ బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్సీకి ఆహ్వానం

బీర్‌పూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో అత్యంత వైభవంగా జరిగే బీర్‌పూర్ శ్రీలక్ష్మీనరసింహా స్వామి జాతర బ్రహ్మోత్సవాలు ఈ నెల 7నుండి 17వరకు కన్నుల పండుగగా జరుగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవితకు, ఎల్.రమణకు ప్రత్యేక ఆహ్వాన పత్రికను మాజీ జడ్పీ చైర్మన్ దావ వసంత, బీఆర్ఎస్ నాయకులు కొల్ముల రమణ, బీఆర్ఎస్ బీర్‌పూర్ మండల అధ్యక్షులు నేరెల్లసుమన్ పత్రికను అందించి ఆహ్వానము తెలిపారు. వీరివెంట సాగి సత్యం రావు, మెరుగు రాజేశం ఉన్నారు.

ఎల్వోసీ అందజేత

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని 17 వ వార్డుకు చెందిన గుండారపు రాజశేఖర్ గుండె సంబందిత వ్యాధితో బాధపడుతుండగా స్థానిక నాయకులు ప్రభాత్ సింగ్ ఠాకూర్ రాజశేఖర్ ఆరోగ్య స్థితిని వివరించగా గుండె ఆపరేషన్ నిమిత్తం రెండున్నర లక్షల ఎల్వోసీని గురువారం నిమ్స్ ఆసుపత్రిలో ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు రాజశేఖర్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

● బీసీ కులగణన విజయవంతంపై హర్షం

కోరుట్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీసీ కులగణన విజయవంతమైన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంకు కృతజ్ఞతలు తెలుపుతూ కాంగ్రెస్ నాయకులు హర్షం ప్రకటించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహంకు నివాళ్లను అర్పించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, పోన్నం ప్రభాకర్, రాష్ట్ర ఓబిసి సెల్ చైర్మెన్ నూతి శ్రీకాంత్‌లకు కృతజ్ఞతలు తెలిపి వారి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు.

ఈ కార్యక్ర మంలో సింగిల్ విండో చైర్మెన్ భూంరెడ్డి, మాజీ కౌన్సిలర్ల్ ఎంబేరి నాగభూషణం, మోర్తాడ్ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయ కులు తిరుమల గంగాధర్, కొంతం రాజం, సత్యనారాయణ,ముక్కెర లింబాద్రీ, సురేష్, పోతుగంటి శంకర్ గౌడ్, ప్రభాకర్, మేకల నర్సయ్య, సత్యనారాయణ, భూమయ్య, లక్ష్మీనారాయణ, డిజయ్ పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో మహిళా కళాశాల విద్యార్థుల ప్రతిభ



ఫలితాలను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్

జగిత్యాల అగ్రికల్చర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ మొదటి సంవత్సర ఫలితాల్లో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల(అటానమస్) జగిత్యాల విద్యార్థులు సత్తా చాటినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 242 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 147 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. మొత్తంగా కళాశాల ఉత్తీర్ణత శాతం 60.74కాగా, బీఏలో 52.17శాతం, బీకాంలో 66.15శాతం, బీఎస్సీ లైఫ్‌సైన్సెస్‌లో 64.28శాతం, బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో 58.33శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, పరీక్ష ఫలితాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంతటి విజయానికి తోడ్పాటును అందించిన సహచర అధ్యాపకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అకడమిక్ కో ఆర్డినేటర్ రామచంద్రం, వైస్ ప్రిన్సిపాల్ చంద్రయ్య, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ వాసవి, టియస్‌కేసీ కోఆర్డినేటర్ నీరజ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సెట్ బ్యాక్ లేకుండా నిర్మాణాలు

● ఫిర్యాదులపై స్పందించని మున్సిపల్ అధికారులు



సెట్‌బ్యాక్ లేకుండా జరుగుతున్న నిర్మాణాలు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో సెట్‌బ్యాక్ లేకుండా చేసే నిర్మాణాలవల్ల ఇబ్బందులు తలెత్తుతాయని తెలిసినప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపనలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలోని కృష్ణానగర్, అరవింద్‌నగర్ కాలనీలలో జరుగుతున్న రెండు నిర్మాణాల విషయంలో సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణం చేస్తున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదు. కృష్ణానగర్ నిర్మాణం విషయంలో కాలనీవాసులు ఇటీవల ఫిర్యాదు చేశారు.

నిర్మాణాల విషయంలో లేఅవుట్, సెట్‌బ్యాక్ ఖచ్చితంగా పాటించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రతి సమావేశంలోనూ చెబుతున్నారు. ఇప్పటికే జగిత్యాల పట్టణంలో రోడ్లు ఇరుకుగా ఉండటంతో పాటు చాలా చోట్ల కనీసం ఫైర్ ఇంజన్ కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. తాజాగా చేస్తున్న నిర్మాణాల్లో కూడా కనీస నిబంధనలు పాటించకుండా ఎలాంటి సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణాలు చేయడం విమర్శలకు తావిస్తోంది.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

-మున్సిపల్ టీపీవో

అరవింద్‌నగర్, కృష్ణానగర్ కాలనీల్లో సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణాలు సాగిస్తున్నారని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారిని వివరణ కోరగా ఎవరైనా ఫిర్యాదు చేస్తే తాము చర్యలు తీసుకుంటామని తెలిపారు. కృష్ణానగర్‌లో చేపడుతున్న నిర్మాణం విసయంలో దాని యాజమాని కోర్టుకు వెళ్లారని కోర్టు తీర్పు తర్వాత చర్యలు తీసుకుంటామన్నారు. కాగా పూర్తి వివరాలకు టీపీఎస్‌ను సంప్రదించామని తెలిపారు. అయితే టీపీఎస్‌కు పలుసార్లు వివరణ కోసం ఫోన్ కాల్ చేస్తే కాల్ కట్ చేశారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

కొడిమ్యాల, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి) : బేటీ బచావో-బేటీ పడావో మండల స్థాయిలో నిర్వహించిన అండర్ 18 బాలికల క్రీడా పోటీలలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె. వేణు తెలిపారు. గురువారం కబడ్డీలో ఉత్తమ ప్రతిభ చూపిన జి. రిషిక, ఎం. నిఖిత, టి. తేజస్విని, ఖోఖోలో ఆర్. నందిని, అథ్లెటిక్ షాట్ ఫుట్‌లో రిషిక రెండవ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ పుష్పగుచ్ఛం అందిచి అభినందించారు.

రేపటి నుంచి మల్లన్న జాతర

కథలాపూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 8 నుంచి మండలంలోని భూషణరావుపేటలో మల్లికార్జునస్వామి జాతరోత్సవాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. 8న గంగ నీళ్ళు ఎదుర్కోవడం, 9న స్వామివారి కళ్యాణం, పట్నాలు, కళ్యాణం, బోనాల ఊరేగింపు, 10న జోగు తిరగడం, ఒగ్గు కథ, 11న ఎల్లమ్మపట్నం, బోనం, అగ్నిగుండం, మహాఅన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు.

పార్కును సందర్శించిన విద్యార్థులు

కోరుట్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ బాలిక పాఠశాల విద్యార్థులు గురువారం హైదరాబాదులోని నేహ్రూ జూలాజికల్ పార్కును సందర్శించారు. పార్క్‌లోని జంతు ప్రదర్శనశాలలో ఎకో క్లబ్‌ను సదర్శించి క్లీన్‌లేన్ డ్రైవ్ నిర్వహించారు. ఏనుగుల షపారీ నందు పేరుకపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయుడు కృష్ణమోహన్ పాల్గొన్నారు.

నూతన అధ్యక్షులకు సన్మానం

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన బీజేపీ పట్టణ, మండల అధ్య క్షులను గురువారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ నల్ల వేంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి బొమ్మెల శంకర్‌ల ఆధ్వర్యంలో మెట్‌పల్లి పట్టణ బీజేపీ పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్, ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులు బాయి లింగారెడ్డి, మెట్‌పల్లి మండల అధ్యక్షులు రాజ్‌పాల్,కోరుట్ల మండల అధ్యక్షులు పంచారి విజయ్‌లను సత్కరించారు.